
# రేషన్

"ఆకాష్వాణి... వ్వావ్వార్తలు చదూతున్నది...సుసుసు...సుద్దముక్క సుధా వాణి... బుర్ర్ర్... అని నేడు రాజీవ్‌గాంధీ ప్రకటన చేశారు... దానికి ప్రతిస్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంటికల రామారావు... క్షమించాలి... ఎన్టీరామారావు డుర్ర్ర్... అన్నారు. తమిళనాడు ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పి గతరాత్రి ఒంటిగంటకి సుమారు నలభైమంది బుర్ర్ర్... గాయపడిన వారిని ప్రభుత్వ ఆసుపత్రికి చేరిస్తే టుర్ర్ర్... బుర్ర్ర్... డుర్ర్ర్..."




చిదానందం సోఫాలో కూర్చుని కాఫీ తాగుతూ వార్తలు వింటున్నాడు. ఇంతలో అతని భార్య రమణి రయ్యిమంటూ హాల్లోకి వచ్చి "వెధవగోల... వెధవగోల" అంటూ రేడియో కట్టేసింది.

చిదానందం తెల్లబోయి భార్యవంక చూశాడు. "అదేంటి?... వార్తలు వింటుంటే రేడియోని అలా కట్టేశావేం?..."

"వినేవాళ్లు రేడియోని సరిగ్గా ట్యూన్ చేస్కుని వినాలి!... లేదా మానెయ్యాలి!!... వెధవగోల!" మళ్లీ విసుక్కుంది రమణి.

"అదేంటే అలా అంటావ్?... నేను రేడియోని సరిగ్గానే ట్యూన్ చేస్కుని వింటున్నాగా... ఎవరు చెప్పారు నేను సరిగ్గా ట్యూన్ చెయ్యలేదని?!"

"ఒకరు చెప్పాలా?...రేడియో చేసే బుర్ర్ర్, డుర్ర్ర్, టుర్ర్ర్ అనే శబ్దాలు చాలవూ?" కళ్లు చిట్లించి అడిగింది.
"అయితే ఆ శబ్దాలు రేడియోలోంచి వస్తున్నాయని అనుకున్నావా?" వస్తున్న నవ్వును పెదాల మధ్య బిగపట్టి అడిగాడు చిదానందం.
"రేడియోనుండి కాకపోతే మరి ఆ శబ్దాలు ఇంకెక్కడినుండి వస్తున్నాయ్?!..." ఆశ్చర్యంగా భర్తవంక చూస్తూ అడిగింది రమణి.
చిదానందం సిగ్గుపడ్తూ మెల్లగా చెప్పాడు:
"నేను కాఫీ తాగుతున్నానుగా... హిహి... నేను కాఫీ తాగుతున్నప్పుడు శబ్దం వస్తుందిగా... నీకు తెలీనిదేముంది?"
"కానీ మీరు కప్పులోని కాఫీని సర్ర్ర్... సర్ర్ర్.. అంటూ లాగుతారుగా... ఈ డుర్, బుర్ శబ్దాలేమిటి?..."
"రోజూ ఒకేరకం శబ్దం వినీవినీ విసుగుపుట్టింది... అందుకే ఈరోజూ రకరకాల శబ్దాలు చేస్తూ తాకుతున్నా వెరైటీ కోసం... హిహి..." వెర్రినవ్వు నవ్వాడు చిదానందం.
"ఏడవలేకపోయారు..." అనేసి వంటగదివైపు అడుగులు వేసింది రమణి.
"ఇదిగో... నిన్నే..." భార్యని పిలిచాడు చిదానందం.
రమణి వెనక్కి తిరిగి చూసి కళ్లెగరవేసింది ఏమిటన్నట్లు.
"కాఫీలో చక్కెర తక్కువైందిగానీ... కాస్తతెచ్చి కప్పులో వెయ్యి..." అన్నాడు చిదానందం.
"మీరిలా కప్పులో పది చంచాల చక్కెర వేస్కుని రోజుకి ఇరవైసార్లు కాఫీ తాగితే సంసారం చెయ్యడం నావల్లకాదు... అసలు నెలకి మనింట్లో ఎంత చక్కెర అవుతుందో తెల్సా?... మనకి రేషన్ కార్డుకూడా లేదు. రేషన్ షాపుకీ, బయట షాపుకీ కిలోకి రూపాయ్ తేడా ఉంది!..." కస్సుబుస్సుమంది రమణి.
"అమ్మో!... అంత తేడా ఉందా?" గుండెలమీద చేతులేస్కున్నాడు చిదానందం.
అంతే... కప్పులో మిగులున్న సగం కాఫీ చిదానందం చొక్కామీద ఒలికిపోయింది. రమణి భర్తవంక కొరకొరా చూసింది.
"సారీనే... చేతిలో కాఫీ కప్పుందని మర్చిపోయి ఆశ్చర్యంతో గుండెలమీద చెయ్యేస్కున్నా... హిహి... పోనీ ఈ చొక్కా నువ్వేం ఉతకనక్కర్లా... లాండ్రీవాడికి పడేస్తా...యేం అట్టాగేనా? హిహి...." పెళ్లాం తిడ్తుందని భయపడ్తూ బలవంతంగా నవ్వు తెప్పించుకుని నవ్వుతూ అన్నాడు

చిదానందం.
"ఊ... ఊ... సర్లే... ఎలాగోలా అఘోరించండి... కానీ నేను చెప్పేది కూడా వినండి" అంది రమణి.
"ఏమిటి?" ప్రశ్నార్థకంగా చూశాడు చిదానందం.
"రేషన్ కార్డు లేకుండా ఎవరూ ఉండరు మనం తప్ప!... రేషన్ కార్డొకటి సంపాదించండని మీకు లక్షసార్లు చెప్పాను. ఆ కార్డుంటే దానిమీద గోధుమలు, వంటనూనె, చక్కెర, బియ్యం అన్నీ కొనుక్కోవచ్చు. మనమేమో అనవసరంగా బోల్డంత డబ్బుపోసి సరుకులన్నీ మార్వాడీ షాపులో కొంటున్నాం..."
"అవునవును... నిజమే!" గంగిరెద్దులా తల ఊపాడు చిదానందం.
"మీరు రేషన్‌కార్డు గురించి పట్టించుకోకపోతే మీకు ఈ క్షణం నుండే కాఫీ ఇవ్వడం మానేస్తా!" పళ్లు కొరుకుతూ అంది రమణి.
"అమ్మో!... అంత పని మాత్రం చేయకు. ఈరోజే దాని సంగతేంటో చూస్తా..." అన్నాడు చిదానందం.
ఇందాక చొక్కామీద కాఫీ ఒంపేసుకున్నందున మరోసారి కాఫీ కావాలని అడిగి పెళ్లాం చేత ముక్క చీవాట్లు తిని రేషన్‌కార్డు సంపాదించడం కోసం చీఫ్ రేషనింగ్ ఆఫీసరు కార్యాలయానికి వెళ్లాడు చిదానందం.
ఆఫీసులో అడుగుపెట్టుండగా హఠాత్తుగా చిదానందం రివ్వున వెనక్కి తూలి గోడమీద పడ్డాడు.
"హారి!... ఏంటబ్బా ఇది?... ఇలా పడ్డానేంటి??..." అనుకుని మళ్లీ లోపలికి వెళ్లబోయాడు. మళ్లీ రివ్వుమని ఇందాకటి కంటే స్పీడుగా వెనక్కి వెళ్లి గోడకి గుద్దుకుని డమాల్‌మని కింద చతికిల బడిపోయాడు.
"ఇదేంట్రా నాయనా.... గోడకి అయస్కాంతం గానీ ఉందా?... అయినా ఇనప ముక్కల్ని లాగే అయస్కాంతాన్ని చూశాగానీ... ఇదేంటి ఇట్టా మనుషుల్ని లాగేస్తుంది?!..." అనుకుని మెల్లగా నేలమీంచి లేచి గోడని రెండు చేతుల్తో తడిమి తడిమి చూడసాగాడు చిదానందం.
"హిహిహి..."
వెనకనుండి ఎవరో నవ్విన శబ్దం వినిపించింది. చిదానందం వెనక్కి తిరిగి చూశాడు. గుమ్మం దగ్గర స్టూలుమీద ప్యూను కూర్చుని నవ్వుతున్నాడు.
"ఏంది?... గోడకి గిట్ట అయ్‌స్కాంతం ఉందని సూస్తున్నావ్?" అడిగాడు ప్యూను చిదానందంని.
చిదానందం ఆశ్చర్యపోయాడు.

"అర్ర్ర్రె!... నీకేలా తెల్సు?" అడిగాడు.
"గీడకొచ్చినోల్లందరూ గట్లనే సూస్తర్ర్ర్... గోడకి అయ్‌స్కాంతం ఏంలేదు... నేనే నిన్ను లోపట్కి పోనియ్‌కుండ కాలర్‌పట్టి వెనక్కి గుంజిన... నువ్వ్ జర్రున వెనక్కి జార్తాపోయి గోడకి గుద్కున్నవ్..." చిరునవ్వుతో సమాధానం ఇచ్చాడు ఫ్యూన్.
"నువ్వు నన్ను కాలర్‌పట్టి వెనక్కిలాగావా? ఎందుకు?" కోపంగా అడిగాడు చిదానందం.
"ఎందుకేంది?... పైసలివ్వకుండా లోపట్కి పోతావ్?... తియ్ నీ యవ్వ..." అన్నాడు ఫ్యూన్ కాలుమీదకాలేసి ఊగిస్తూ దర్జాగా.
తన అజ్ఞానానికి సిగ్గుపడ్తూ జేబులోంచి రూపాయి బిళ్ల తీసి వాడిచేతిలో పెట్టాడు చిదానందం. వాడు వెంటనే దాన్ని నేలకేసి విసిరికొట్టాడు.
"ఏందిది?... నేనేమైనా బిచ్చపోడ్ననీ అనుకుంటున్నావా?... అర్రే!... ఇస్కి..." అన్నాడు గుర్రుగా చిదానందంవంక చూస్తూ
చిదానందం ఈసారి సిగ్గుతో చితికిపోయాడు. "ఛీ... ఏంటి నేను మరీ ఇంత తెలివి లేనోడ్లా ప్రవర్తిస్తున్నా" అనుకుని కిందనుండి రూపాయిబిళ్ల ఏరుకుని ఫ్యూను చేతిలో రెండురూపాయల నోటు పెట్టాడు. అప్పుడు పళ్లు ఇకిలించి చిదానందంని లోపలికి వదిలాడు ఫ్యూను.
చిదానందం లోపల కొత్తకార్డుల పని చూసే వ్యక్తి డింభకరావుకి రేషన్ కార్డు కోసం అప్లికేషన్ ఇచ్చాడు.
"వారం తరువాత రండి..." అన్నాడు డింభకరావు చిదానందం మొహం వంక చూడనైనా చూడకుండా అతని చేతిలోని అప్లికేషన్ సర్ర్ర్‌మని లాక్కుంటూ.
చిదానందం వారం తర్వాత మళ్లీ ఆ ఆఫీసుకి వెళ్లాడు. ఆఫీసు లోపలికి అడుగపెడ్తానే రివ్వున వెనక్కి తూలి గోడకి కొట్టుకున్నాడు.
అప్పుడు అతనికి ఫ్యూను సంగతి గుర్తుకువచ్చి నాలుక కొరుక్కుని లేచి నిలబడి ఫ్యూను చేతిలో రెండురూపాయల నోటు పెట్టి డింభకరావు దగ్గరికి వెళ్లాడు.
"నాకు కొత్త కార్డు ఇస్తారా?" అతన్ని అడిగాడు చిదానందం.
"అప్లికేషన్ ఇవ్వండి." ఎటో చూస్తూ అన్నాడు డింభకరావు.
"అదేంటి, పోయిన వారం మీకు ఇచ్చానుగా?" ఆశ్చర్యంగా అడిగాడు చిదానందం.
"పోయిన వారమా?... లేదే... మిమ్మల్నెప్పుడూ చూళ్లేదే!!!..."

అంతకన్నా ఆశ్చర్యంగా అన్నాడు డింభకరావు.
"నేను వచ్చాను కానీ మీరు నా మొహం చూళ్లేదు..."
"నేనెవరి మొహం చూణ్ణు..." అని ఫైళ్లలో వెతికి చిదానందం అప్లికేషన్ బైటకి తీశాడు.
తరువాత దాన్ని కాస్సేపు పరిశీలించి "మీరు నేటివిటీ సర్టిఫికేట్ దీన్తో జత చేయాలి! ఆ సర్టిఫికేట్ తెండి..." అన్నాడు.
చిదానందం వారంరోజులపాటు తాసిల్దారు ఆఫీసు చుట్టూ తిరిగి నేటివిటీ సర్టిఫికేట్ సంపాదించి మళ్లీ రేషనింగ్ ఆఫీసుకి వెళ్లాడు.
"మీరు ఇంతవరకు కార్డు ఎందుకు తీస్కోలేదు?" అడిగాడు డింభకరావు.
"ఎందుకంటే, ఇదివరకు మేం చాటపర్రులో ఉండేవాళ్లం... ఈ మధ్యనే ఇక్కడికి ట్రాన్స్ఫరై వచ్చాం..." చెప్పాడు చిదానందం.
"మరి ఆ ఊళ్లో కార్డు తీస్కోలేదా?"
"లేదు..."
"అయితే, ఆ ఊళ్లో మీకు రేషన్‌కార్డు లేదని ఇంకో సర్టిఫికేట్ తెండి..." అన్నాడు డింభకరావు.
చిదానందం తల పట్టుకున్నాడు.
రెండువారాలు ప్రయత్నించి ఆ సర్టిఫికేట్ కూడా సంపాదించాడు. ఒక శుభ ముహూర్తాన చిదానందానికి కొత్తరేషన్ కార్డు ఇచ్చారు.
ఇంత కష్టపడి సంపాదించిన రేషన్ కార్డు తీస్కుని ఓ రోజు రేషన్ షాపుకెళ్లాడు చిదానందం.
"చక్కెర ఉందా?" అడిగాడు.
"నో స్టాక్" అన్నాడు షాపువాడు.
"గోధుమలు?"
"నో స్టాక్..."
"నూనే?"
"అది కూడా నో స్టాక్... అసలు ఏమీ లేవయ్యా... నన్ను విసిగించకు." షాపువాడు విసుక్కున్నాడు.
చిదానందం తెల్లమొహం వేశాడు.

* * *